


ఈతరం సరదా

ఒకరు నేర్చుకుంటున్నారు, మరొకరు దానిలో పెరిగారు. ఒకరిది భద్రమైన వాతావరణం, మరొకరిది సవాలుతో కూడిన ప్రపంచం. కానీ వారి కళ్లల్లోని ఆనందం మాత్రం ఒక్కటే. నీటితో ఆడుకునే స్వచ్ఛమైన సంతోషం. ఈ వేర్వేరు నేపథ్యాలు వారి భవిష్యత్తును నిర్దేశించవచ్చు కానీ, ప్రస్తుతానికి మాత్రం నీరు వారికి ఆటస్థలం, ఆనందానికి మూలం. రైల్వే ఆధ్వర్యంలో ఉచిత వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా చిన్నారులకు స్విమ్మింగ్ నేర్పుతున్నారు. మరోవైపు నిత్యం సంద్రంలో ఈదుతూ సందడి చేస్తున్నారు మత్స్యకార పిల్లలు.

– ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం




న్యూస్‌రీల్

పుష్పయాగానికి పూలు తరలింపు



తిరుమల తరలిస్తున్న వివిధ రకాల పుష్పాలతో మహిళ భక్తులు

ఎంవీపీ కాలనీ: తిరుపతిలోని శ్రీ కొండండరామస్వామి వారి పుష్పయాగం కోసం విశాఖ నుంచి వివిధ రకాల పూలను తరలించారు. కార్తీక దినోత్సవ కమిటీ ఆధ్వర్యంలో జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి సేకరించిన ఈ పుష్పాలను శుక్రవారం ఉదయం ఎంవీపీ కాలనీలోని టీటీడీ ఈ–దర్శనం కౌంటర్ వద్ద భక్తుల సందర్శన కోసం ఉంచారు. మహిళా భక్తులు ముందుగా పూలను అందంగా తీర్చిదిద్ది ప్యాకింగ్ చేశారు. అనంతరం సంకల్పం చేసి, శాస్త్రోక్తంగా ఈ పూలను తిరుమలకు పంపించారు. కలువలు, తామరలతో పాటు పలు రకాల పూలు ఉన్నాయని ఆధ్యాత్మిక వేత్త హిమాన్షు ప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో నగరానికి చెందిన మహిళా భక్తులు పాల్గొన్నారు.

అప్పన్న ఆలయంలో ఘనంగా తిరునక్షత్రం పూజలు




అప్పన్న ఉత్సవమూర్తులు, భగవత్ రామానుజాచార్యుల ఉత్సవమూర్తి

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో విశిష్టాద్వైత స్థాపకులు భగవత్ రామానుజాచార్యుల 1008వ జయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ఏటా ఐదు రోజుల పాటు నిర్వహించే ఈ తిరునక్షత్రం పూజలు గత నెల 28న ప్రారంభమయ్యాయి. చివరి రోజైన శుక్రవారం జయంతి సందర్భంగా ఆలయ బేడామండపంలోని హంసమూలన గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవి, భగవత్ రామానుజాచార్యుల ఉత్సవమూర్తులతో పాటు ఆళ్వారులను వేంజింపజేశారు. అనంతరం షోడశోపచార పూజలు, విశేష హారతులు, పారాయణాలు నిర్వహించారు. ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, అర్చకులు, పారాయణదారులు ఈ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం రామానుజాచార్యుల తిరువీధి ఉత్సవం వైభవంగా జరిగింది.

జీవీఎంసీ సిబ్బందిపై క్రమశిక్షణ చర్యలు

అల్లిపురం: అర్బన్ ల్యాండ్ సీలింగ్ పరిధిలో అక్రమంగా అపార్ట్‌మెంట్ నిర్మాణం చేపట్టిన బిల్డర్‌కు సహకరించిన జీవీఎంసీ సిబ్బందిపై ప్రభుత్వం క్రమశిక్షణా చర్యలు చేపట్టింది. ఈ మేరకు మున్సిపల్ అడ్మినిస్ట్రేటివ్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ విజిలెన్స్ విభాగం, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. మద్దిలపాలెం టౌన్ సర్వే నంబర్ 28, 46/2లో దాడి శ్రీరామకృష్ణ అనే వ్యక్తి అర్బన్ ల్యాండ్ సీలింగ్ స్థలంలో అపార్ట్‌మెంట్ నిర్మించేందుకు సహకరించిన జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ అసిస్టెంట్ సీహెచ్.మధుసూదనరావు, అసిస్టెంట్ సిటీ ప్లానర్ ఎ.లక్ష్మణరావు, ప్రస్తుతం జీవీఎంసీ మానిటరింగ్ సెల్‌లో అదనపు డిప్యూటీ కమిషనర్–1గా విధులు నిర్వహిస్తున్న ముగడ రాజులపై ఏపీ సివిల్ సర్వీస్ రూల్స్ ప్రకారం క్రమశిక్షణా చర్యలు తీసుకోనున్నారు. ఈ మేరకు క్రమశిక్షణా సంఘం విచారణ జరిపి తగిన చర్యలు చేపడుతుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ప్రత్యేక తరగతులు పరిశీలించిన డీఈవో



పదో తరగతి విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో ప్రేమ్‌కుమార్

గోపాలపట్నం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న పదో తరగతి ప్రత్యేక తరగతులను జిల్లా విద్యాశాఖాధికారి ప్రేమ్ కుమార్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. తరగతులకు హాజరైన విద్యార్థులను ఆయన పలు ప్రశ్నలు వేసి వారి సామర్థ్యాన్ని పరిశీలించారు. పాఠశాలలో ఉన్న సదుపాయాలు, తరగతుల నిర్వహణ పట్ల ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులకు పరీక్షలకు ఎలా సన్నద్ధం కావాలి, చదివే విధానం గురించి వివరించారు. పరీక్షలు రాసే మెలకువలను తెలియజేశారు. ఉపాధ్యాయులు విద్యార్థుల హాజరును పెంచాలని సూచించారు.

హామీలు ఆవిరి



'నిన్ను నమ్మం బాబూ!' అంటున్నారు జనం. ఉచిత గ్యాస్ సిలిండర్ సంగతి ఏమైందో? సబ్సిడీ జాడ లేదు! 'తల్లికి వందనం' అన్నారు.. కానీ ఆ ఊసే లేదు! సూపర్ సిక్స్ హామీలు మాత్రం సూపర్ స్పీడ్‌తో గాలిలో కలిసిపోయాయి. అలాంటప్పుడు ఇది మంచి ప్రభుత్వమని ఎలా నమ్మాలి..హామీలు ఇవ్వడం, ఆ తర్వాత వాటిని మర్చిపోవడం... ఇదేనేమో వీళ్ల పాలనా సూత్రం ...అని ప్రజలు కూటమి ప్రభుత్వాన్ని నిలదీస్తున్నారు. శుక్రవారం కృష్ణాగార్డెన్స్‌లో మహిళలు ఆందోళన నిర్వహించారు.

10లో

అతిథి గృహంలో హడావుడి



విచారణ అనంతరం బయటకు వస్తున్న ఎన్‌డీఆర్‌ఎఫ్ ప్రతినిధులు

- నర్క్యూట్ హౌస్‌లో రెండోరోజు విచారణ
- సింహాచలం విషాద ఘటనపై త్రిసభ్య కమిషన్
- అర్చకుల నుంచి రెవెన్యూ సిబ్బంది వరకూ ప్రతి ఒక్కరినీ విచారించిన కమిషన్
- మృతదేహాలు వెలికి తీసిన వారంతా సంప్రోక్షణ చేసుకోకుండానే విధుల్లోకి రావడంపై అభ్యంతరాలు వ్యక్తం చేసిన అర్చకులు
- నేడు ప్రభుత్వానికి నివేదిక అందజేత



విచారణ అనంతరం బయటకు వస్తున్న నగర పోలీసు కమిషనర్ బాగ్చీ

సాక్షి, విశాఖపట్నం : ఊహకందని దారుణం.. సింహగిరి చరిత్రలో విషాద పేజీగా నిలిచిపోయిన చందనోత్సవం దుర్ఘటనపై ప్రాథమిక విచారణ పూర్తయింది. తొలిరోజున సింహాచలంపై సాగగా.. మలి రోజున ప్రభుత్వ అతిథి గృహం వద్ద హడావుడి కనిపించింది. అర్చకులు, వేదపండితులతో పాటు రెవెన్యూ, దేవదయ ధర్మాదాయ.. విభిన్న శాఖల అధికారులు, సిబ్బంది విచారణకు హాజరయ్యారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ సుదీర్ఘ విచారణ సాగింది. దుర్ఘటనపై అన్ని విభాగాల నుంచి సమాచారం సేకరించిన త్రిసభ్య కమిషన్ ప్రభుత్వానికి శనివారం నివేదిక సమర్పించనుంది.

సింహాచలంలో ఏటా ఒక రోజు జరిగే పవిత్ర పర్వదినం అప్పన్న నిజరూపదర్శనం.. చందనోత్సవం విషాదోత్సవంగా మారిపోయిన ఘటన నుంచి విశాఖవాసులు ఇంకా తేరుకోలేకపోతున్నారు. దేవాలయ చరిత్రలో ఇలాంటి దురదృష్టకరమైన ఘటన జరగడం ఇదే తొలిసారి కావడంతో.. భక్తులు ఆందోళన చెందుతున్నారు. మంత్రుల నిర్లక్ష్యంతో ఏడుగురు ప్రాణాలు బలిగొన్న తర్వాత ఉలిక్కి పడిన ప్రభుత్వం.. హడావుడిగా నియమించిన త్రిసభ్య కమిషన్ రెండు రోజుల విచారణ పూర్తి చేసింది. 72 గంటల్లో ప్రాథమిక నివేదిక ఇవ్వాలని ఆదేశాలు జారీ చేయడంతో.. గురువారం, శుక్రవారం రెండు రోజుల పాటు సుదీర్ఘంగా విచారణ చేపట్టి సమగ్ర వివరాలు సేకరించింది. ఆది నుంచీ గోడ కట్టకూడదని చెప్పినా వినిపించుకోకుండా.. కట్టడం వల్లనే విషాదం చోటు చేసుకుందని అర్చకులు వ్యాఖ్యానిస్తున్న నేపథ్యంలో.. త్రిసభ్య కమిషన్ దేవస్థాన అర్చకులను కూడా విచారించింది. మాడవీధిని ఆనుకొని రక్షణ గోడ ఉన్నప్పుడు దాని పక్కన కొత్తగా మరో గోడ కట్టడం సరికాదంటూ వైదికులు చెప్పినా పట్టించుకోలేదని కమిషన్‌కు చెప్పినట్లు సమాచారం. ప్రభుత్వం ఈ మహాపచారం చెయ్యడం వల్లే పెను విషాదం సంభవించిందని కూడా కమిషన్ ముందు తమ స్పందన వెలిబుచ్చినట్లు తెలుస్తోంది. **అదేవిధంగా మృతదేహాల వెలికితీత, శిథిలాల తొలగింపులో పాల్గొన్న** సిబ్బందిని పుణ్యస్నానాలు ఆచరింపజేయకుండా, సంప్రోక్షణ చేసుకోనివ్వకుండా.. విధుల్లోకి తిరిగి చేర్చడంపైనా అర్చకులు కమిషన్ ముందు ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. ఇలా ప్రతి విషయంలోనూ ఆగమశాస్త్ర ఉల్లంఘనలు జరిగాయని కమిషన్‌కు అర్చకులు వెల్లడించారు.

వరదనీటి వ్యవస్థ లేదా..?

సింహాచలంలో వరద నీటిని నియంత్రించేందుకు సరైన వ్యవస్థ లేకపోవడంపై కమిషన్ ఆశ్చర్యం వ్యక్తం చేసింది. 2018లో రూపొందించిన దేవస్థానం మాస్టర్‌ప్లాన్‌లోనూ ఈ అంశాన్ని పొందుపరచకపోవడంపై దేవస్థానం అధికారులు, వీఎంఆర్‌డీఏ అధికారులపైనా కమిషన్ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. రెండు మూడు దశాబ్దాలుగా సింహగిరిపై పడుతున్న సగటు వర్షపాతాన్ని పరిగణనలోకి తీసుకొని.. దానికనుగుణంగా నియంత్రించే వ్యవస్థను ఏర్పాటు చేసుకోకపోవడం సరికాదని సూచించింది. కనీసం వరద నీటి నియంత్రణకు సంబంధించి ఎలాంటి చర్యలు తీసుకోవాలన్న అంశాలపై అధికారులు దృష్టి సారించకపోవడంపైనా విస్మయం చెందారు. మాస్టర్‌ప్లాన్‌లో ఉల్లంఘనలు ఉన్నట్లు కూడా ఉన్నాయని గుర్తించిన త్రిసభ్య కమిషన్... ఈ విషయంపై ఎందుకు దృష్టి సారించలేదని ఆయా శాఖల అధికారుల్ని ప్రశ్నించింది. రెండు రోజుల పాటు జరిగిన విచారణలో అన్ని శాఖల నుంచి సమగ్ర వివరాల్ని సేకరించిన కమిషన్.. శనివారం ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనుంది. ఈ నివేదికను అనుసరించి.. ప్రభుత్వం ఎవరిపై చర్యలు తీసుకోవాలన్నదానిపై నిర్ణయం తీసుకోనుంది. అయితే కేవలం చిన్న స్థాయి అధికారులపైనే ప్రతాపం చూపించి.. నిర్లక్ష్యంగా వ్యవహరించిన మంత్రులపై కనీస చర్యలు ఉండవనే విమర్శలు వినిపిస్తున్నాయి.

తప్పు మాది కాదంటే.. మాది కాదు

శాఖల వారీగా విచారణ కొనసాగింది. దేవస్థాన అధికారులు, ఇంజినీర్లను తొలుత విచారించారు. గోడ నిర్మాణం, ప్రసాద్ పనుల ఆలస్యం.. మొదలైన విషయాలపై ఆరా తీశారు. అదే సమయంలో టూరిజం ఇంజినీరింగ్ అధికారులను కూడా విచారణకు హాజరవ్వమని ఆదేశించడంతో హుటాహుటిన అక్కడికి చేరుకున్నారు. ఇరు విభాగాల్ని ఒకేసారి విచారించిన కమిటీ ముందు.. గోడ నిర్మాణం, పనుల ఆలస్యం మొదలైన అంశాల్లో తప్పు మా శాఖది కాదు.. టూరిజం వాళ్లదేనని దేవస్థానం అధికారులు.. తమది కాదు.. వాళ్లదేనని టూరిజం ఇంజినీర్లు వాదించుకొని.. ఒకరిపై ఒకరు తప్పు నెట్టేసుకునేందుకు యత్నించినట్లు తెలుస్తోంది. దేవస్థాన ఇంజినీర్లతో పాటు టూరిజం ఇంజినీర్లది కూడా బాధ్యత ఉందని, వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలంటూ జిల్లా అధికారులు కమిషన్‌కు నివేదించినట్లు సమాచారం.

ప్రభుత్వమే అసలు దోషి.!

ఈ ప్రమాదం వెనుక ప్రభుత్వ నిర్లక్ష్యమే తప్పు.. ఇంకోటి లేదన్నది ప్రతి ఒక్కరి నుంచి వినపడుతోంది. భారీస్థాయిలో భక్తులు వస్తారని, ప్రతి చందనోత్సవానికి వర్షం పడుతుందని తెలిసినా.. ఏర్పాట్లు విషయంలో కనీస జాగ్రత్తలు పాటించకపోవడంపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతోంది. నిర్వహణ ఏర్పాట్లు పర్యవేక్షించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఐదుగురు మంత్రుల కమిటీ బాధ్యతారాహిత్యం ఏడుగుర్ని పొట్టనపెట్టుకుందనీ.. వారిపైనా చర్యలు తీసుకోవాలంటూ సీపీఎం డిమాండ్ చేస్తోంది. కేవలం.. అధికారులు, ప్రభుత్వ సిబ్బందిని బలి చెయ్యకుండా.. ఈ ప్రమాదం వెనుక ఉన్న మంత్రులపైనా ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలంటూ ప్రతి ఒక్కరూ డిమాండ్ చేస్తున్నారు.

ఆఈట్‌కు 5,948 దరఖాస్తులు

5న రాష్ట్రవ్యాప్తంగా ప్రవేశపరీక్ష

ఎంవీపీకాలనీ: ఆంధ్రవిశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ ప్రవేశ పరీక్ష (ఏయూఈఈటీ)కి దరఖాస్తు గడువు ఈ నెల 1వ తేదీతో ముగిసింది. 2025–2026 విద్యా సంవత్సరానికి గాను 5,948 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారని ఏయూ డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ ఆచార్య నాయుడు శుక్రవారం తెలిపారు. ఏయూ ఇంజినీరింగ్ కళాశాలలో అందుబాటులో ఉన్న 690 సీట్లకు ఈ దరఖాస్తులు వచ్చాయి. రాష్ట్రవ్యాప్తంగా 13 కేంద్రాల్లో ఈ నెల 5న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు. విశాఖ నగరంలో 7 కేంద్రాలతో పాటు తిరుపతి, గుంటూరు, విజయవాడ, రాజమండ్రి, శ్రీకాకుళం, విజయనగరంలలో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. పరీక్ష నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని అధికారులు తెలిపారు. ఫలితాలు వెల్లడించిన అనంతరం కౌన్సిలింగ్ తేదీలను ప్రకటిస్తామని వారు పేర్కొన్నారు.

జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ ఓపెన్ ఫోరానికి 23 వినతులు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న చీఫ్ సిటీ ప్లానర్ ప్రభాకరరావు

డాబాగార్డెన్స్: జీవీఎంసీలో ప్రతి శుక్రవారం నిర్వహిస్తున్న టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరానికి 23 వినతులు వచ్చాయని చీఫ్ సిటీ ప్లానర్ ఎ ప్రభాకరరావు తెలిపారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో సీపీలు, డీసీపీలు, ఏసీపీలతో కలిసి ఆయన ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రభాకర రావు మాట్లాడుతూ, ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో టౌన్ ప్లానింగ్ సంబంధిత ఫిర్యాదులు ఎక్కువగా వస్తున్నందున, వాటిని ప్రత్యేకంగా పరిష్కరించేందుకు ప్రతి శుక్రవారం టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్ నిర్వహిస్తున్నామన్నారు. ఈ వారం అందిన 23 వినతుల్లో జోన్–2 నుంచి ఐదు, జోన్–3 నుంచి తొమ్మిది, జోన్–4 నుంచి ఒకటి, జోన్–5 నుంచి మూడు, జోన్–6 నుంచి నాలుగు, జోన్–8 నుంచి ఒకటి చొప్పున ఉన్నాయని ఆయన వివరించారు. అందిన వినతులను నిర్ణీత సమయంలో పరిష్కరించాలని టౌన్ ప్లానింగ్ అధికారులను ఆయన ఆదేశించారు.

మంత్రుల కమిటీ నిర్లక్ష్యమే కారణం

- త్రిసభ్య కమిషన్ నిష్పక్షపాతంగా విచారణ జరపాలి
- సింహాచలం సంఘటన బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి
- కాంక్రీట్ పునాది, పిల్లర్లు లేకుండా గోడ నిర్మాణంలో అవినీతి జరిగింది
- మృతుల కుటుంబాలకు రూ.కోటి, క్షతగాత్రులకు రూ.10 లక్షలు ఇవ్వాలి
- త్రీ మెన్ కమిషన్‌కు వినతి పత్రం అందజేసిన సీపీఎం



ఉన్నతాధికారులకు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నేతలు

సాక్షి, విశాఖపట్నం : చందనోత్సవం కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఐదుగురు మంత్రుల కమిటీ బాధ్యతా రాహిత్యం వల్లే సింహాచలం ఘోర దుర్ఘటన జరిగిందని సీపీఎం విశాఖ జిల్లా బృందం ఆరోపించింది. చందనోత్సవ విషాద ఘటనపై ప్రభుత్వం నియమించిన త్రిసభ్య కమిషన్ సర్క్యూట్ హౌస్‌లో రెండో రోజు విచారణ చేపడుతున్న నేపథ్యంలో సిపిఎం విశాఖ జిల్లా బృందం కలిసి కమిషన్‌కు వినతిపత్రం అందజేసింది. ఈ సందర్భంగా సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గు నాయుడు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు, కార్పొరేటర్ గంగారావు కమిషన్‌తో మాట్లాడుతూ చందనోత్సవ నిర్వహణ, ఏర్పాట్లు పరిశీలనకు నియమించిన ఐదుగురు మంత్రుల కమిటీ బాధ్యతారాహిత్యం కారణంగానే ఈ పెను విషాదం సంభవించిందని కమిషన్ దృష్టికి తీసుకెళ్లారు. నిష్పక్షపాతంగా విచారణ నిర్వహించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం సీపీఎం నేతలు మీడియాతో మాట్లాడుతూ మంత్రుల కమిటీ తగిన పర్యవేక్షణ, నూతన నిర్మాణాల తనిఖీలు, కట్టుదిట్టమైన ఏర్పాట్లు, అన్నిరకాల భద్రతా చర్యలు తీసుకొని ఉన్నట్లయితే ఈ దుర్ఘటన జరిగుండేది కాదని అభిప్రాయపడ్డారు. చందనోత్సవానికి కేవలం కొన్ని రోజులకు ముందు అతి పెద్ద గోడ నిర్మాణం చేయడం, అదికూడా తగిన ప్లాన్, కాంక్రీట్ పునాది, పిల్లర్లు లేకుండా నాసిరకం మెటీరియల్‌తో నిర్మించడం కారణంగా ప్రమాదం సంభవించిందన్నారు. ఇందులో పెద్దఎత్తున అవినీతి జరిగిందనేది స్పష్టంగా కనిపిస్తోందన్న విషయాన్ని కమిషన్ దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. కాంట్రాక్టర్ తోపాటు పనిని పర్యవేక్షించాల్సిన ఇంజినీర్లు, దేవాలయ అధికారులు బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. మంత్రుల కమిటీతో పాటు స్థానిక ఎమ్మెల్యే, ఎంపీలు కూడా నిర్లక్ష్య వైఖరి అవలంబించడం వల్లనే ఏడుగురు భక్తులు ప్రాణాలు కోల్పోయిన దురదృష్టకర ఘటన జరిగిందని, వీరందరిపైనా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చందనోత్సవం ఏర్పాట్లు పై ఎప్పటి కప్పుడు సమీక్షలు చేయడంలో విఫలమైందని వ్యాఖ్యానించారు. దుర్ఘటనలో చనిపోయిన వారికి రాష్ట్ర ప్రభుత్వం కేవలం రూ. 25 లక్షలు మాత్రమే నష్టపరిహారం ఇవ్వడం న్యాయ సమ్మతం కాదని, ఒక్కొక్కరికీ రూ.కోటి పరిహారం అందించాలని, కాంట్రాక్టు ఉద్యోగం కాకుండా పర్మినెంట్ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నట్లు జగ్గునాయుడు, గంగారావు అన్నారు. కమిషన్ చైర్మన్‌కు వినతి పత్రం సమర్పించిన వారిలో పార్టీ నేతలు ఆర్కే, ఎస్వీ కుమార్, పి.మణి, జగన్, జ్యోతీశ్వరరావు ఉన్నారు.

అశోక్ గజపతికి బాధ్యత లేదా?

- ప్రమాద సమయంలో సింహగిరిపైనే అశోక్
- మృతుల కుటుంబాలను పరామర్శించలేదు
- కనీసం సంఘటనా స్థలానికి రాని వైనం



తొలిదర్శనం చేసుకున్న అనంతరం ఆలయంలో కుటుంబ సమేతంగా అశోక్‌గజపతిరాజు (ఫైల్)

సింహాచలం: సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి క్షేత్ర చరిత్రలో కనీవినీ ఎరుగని దుర్ఘటన చోటుచేసుకుంది. చందనోత్సవం రోజున షాపింగ్ కాంప్లెక్స్ వద్ద నాసిరకంగా నిర్మించిన గోడ కూలి ఏడుగురు భక్తులు మృతి చెందడం తీవ్ర విషాదాన్ని నింపింది.ఈ ఘటన జరిగి మూడు రోజులు గడుస్తున్నా, దేవస్థానం వంశపార ధర్మకర్త పూసపాటి అశోక్‌గజపతిరాజు మాత్రం ఇంతవరకు సంఘటనా స్థలాన్ని సందర్శించక పోవడం, మృతుల కుటుంబాలను పరామర్శించకపోవడం విమర్శలకు దారితీస్తోంది. చందనోత్సవం రోజున స్వామివారి తొలి దర్శనం చేసుకునేది వంశపార ధర్మకర్తలే. ఆనవాయితీ ప్రకారం.. అశోక్‌గజపతిరాజు మే 29న రాత్రి సింహగిరిపై బస చేసి, 30న తెల్లవారుజామున కుటుంబసమేతంగా తొలి దర్శనం చేసుకున్నారు. అనంతరం ఆయన అక్కడే ఉన్న సమయంలో గోడ కూలి ప్రమాదం జరిగింది. భారీ రెస్క్యూ ఆపరేషన్ కొనసాగినా, అంబులెన్సులు, పోలీసు వాహనాల సైరన్లు మారుమోగినా అశోక్‌గజపతిరాజు ప్రమాద స్థలానికి రాలేదు. మూడు రోజులు గడిచినా ఆయన సంఘటనా స్థలాన్ని సందర్శించకపోవడం, మృతుల కుటుంబాలను పరామర్శించకపోవ డంతో భక్తులు ఆగ్ర హం వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో దేవస్థానంలో జరిగిన చిన్న చిన్న విషయాలపై సైతం మీడియా ముందుకు వచ్చి విమర్శలు గుప్పించిన అశోక్‌గజపతిరాజు, ఇప్పుడు ఇంతటి ఘోర ప్రమా దం జరిగినా స్పందించకపోవడం విడ్డూరంగా ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. భక్తుల సౌకర్యాలే ముఖ్యమని నీతులు చెప్పే ఆయన, వారి మరణం పట్ల వ్యవహరించిన తీరు బాధాకరమని అంటున్నారు. మృతుల కుటుంబాలకు దేవస్థానం తరఫున నష్టపరిహారం అందించాల్సిన బాధ్యత కూడా ఆయనపై ఉందని పలువురు పేర్కొంటున్నారు.

ఎంపీ‌ది అదే దారి..

సింహగిరిపై చందనోత్సవంరోజు గోడ కూలి ఏడుగురు భక్తులు మృతిచెందిన ఘోర ప్రమాదంలో ఎంపీ భరత్ ఇప్పటివరకు మృతుల కుటుంబాలను పరామర్శించలేదు. ఆయన తీరుపై విమర్శలు వెల్లువెత్తున్నాయి.

విద్యుత్ షాక్‌కు ముగ్గురు బలి

నగరంలో వరుస విషాదాలు చోటుచేసుకున్నాయి. ఊహించని రీతిలో విద్యుత్.. ముగ్గురి నిండు ప్రాణాలను బలిగొంది. నగరంలో వేర్వేరు ప్రాంతాల్లో ఈ సంఘటనలు చోటుచేసుకున్నాయి.

సరస్వతీ పుష్కరాలకు ఆర్టీసీ బస్సులు


10లో

దివ్యాంగ ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

నేడు సింహాచలంలో సంప్రోక్షణ

ఎంవీపీకాలనీ: సింహాచలంలో గోడ కూలి ఏడుగురు మృతి చెందిన సంఘటన స్థలంలో శనివారం వేద పండితుల సమక్షంలో సంప్రోక్షణ, శాంతి హోమాలు నిర్వహించనున్నట్టు ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం ఎంవీపీ కాలనీలోని ఆయన నివాసంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడారు. సంఘటనపై ఇప్పటికే సీనియర్ ఐఏఎస్‌లతో కూడిన త్రీమెన్ కమిటీ విచారణ పూర్తి చేసిందన్నారు. నివేదిక రాగానే కారకులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ దుర్ఘటనలో మృతుల కుటుంబాలకు ఇప్పటికే ప్రభుత్వం రూ.25 లక్షలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించిందన్నారు.











CHANGE OF NAME
I, KAVITI PRAVALIKA (New Name), W/o. Kaviti Dileep Kumar, previously called as PRAVALIKA DUVVADA (Old Name) resident of D.No.18-130/1, Port Colony, Street No.1, Nagarpalem Road, Madhurawada, Visakhapatnam, Andhra Pradesh-530048. Now changed my name from PRAVALIKA DUVVADA to KAVITI PRAVALIKA. Henceforth I will be called as KAVITI PRAVALIKA (New Name) for all purposes.

CHANGE OF NAME
I, SUNITHA BETHA (new name) Daughter of Ramakrishna Rao Betha, previously called SUNITHA PAMPANA (old name), resident of Flat No.101, SS Gardens, HPCL Layout, Opp. Ramalayam, 3rd Bus Stop., P.M.Palem, Visakhapatnam-530041, Andhra Pradesh. Now changed my name from SUNITHA PAMPANA (old name) to SUNITHA BETHA (new name). Henceforth I will be called as SUNITHA BETHA (New Name) for all purposes.

Education
■ Contact for Admissions in best colleges of B.Tech, MBBS, BDS, BAMS, BHMS, Ag. B.Sc, MBA, Paramedical courses in India and Abroad. Ph : 79972 96796 [V- 12453]

SPOKEN ENGLISH
■ Spoken English Batches Commence for Children / Adults on 5th May 2025 Morning Batch. Contact : Sheila Jackson - 98484 98510. Olivet English Institute, Vizag. [SCA25003075]

Real Estate

PLOT FOR SALE
■ అతి తక్కువ ధరకే ఇంటి స్థలం. గాజువాక దగ్గరలో, GVMC పరిధిలో 90, 100, 150 గజాలు ప్లాట్లు కలవు గజం ధర : 5,999/-, రిజిస్ట్రేషన్ ఫ్రీ. ఫోన్ : 91601 91101 [SCA25003051]

Services

GOLD LOANS
■ లోకేష్ గోల్డ్ లోన్స్ :- బ్యాంక్/ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి అదే రోజు మార్కెట్ రేటుకు కొనబడును. సంప్ర :- 98484 88068/ 77992 23300 [V- 13197]

Wanted
■ SBI LIFE INSURANCE Sales Manager / Dev. Officer onrole Job Recruitment. S.KOTA, VZM, NAD, VIZAG. Min.1Yr. Sales Exp. Cont. BM. : 90522 16662. Agents, Team Leader Commission, Foreign Trips, Pension, Free Health Card. [V- 2792]

■ వైజాగ్ గాజువాక, ఆటోనగర్ ఏరియాలో పని చేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. 12 Hours Duty. Salary-14000, Age 50 Below, Spot Joining. ✆ 97034 65118 [B-48]

సినిమా వార్తల కోసం లాగ్ఆన్ అవ్వండి www.sakshi.com

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంకు అకౌంట్ ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నగరంలో వరుస విషాదాలు చోటుచేసుకున్నాయి. ఊహించని రీతిలో విద్యుత్.. నిండు ప్రాణాలను బలిగొంది. వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన ప్రమాదాల్లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని, పెయింటర్, వాచ్‌మన్ విద్యుదాఘాతానికి గురై మరణించారు. ఈ విషాద ఘటనలు ఆయా కుటుంబాల్లో తీరని శోకాన్ని నింపాయి. బాధిత కుటుంబాలు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నాయి.

విద్యుత్ షాక్‌కు ముగ్గురి బలి

- వేర్వేరు చోట్ల ఘటనలు
- మూడు కుటుంబాల్లో విషాదం

కిందపడిన ఫ్లెక్సీని సరిచేస్తుండగా..

గోపాలపట్నం: జీవీఎంసీ 90వ వార్డు పరిధిలోని ఏపీఎస్ఈబీ కాలనీలో శుక్రవారం విషాద ఘటన చోటు చేసుకుంది. కిందపడిపోయిన ఫ్లెక్సీని సరిచేయబోయి మనిపూరి కృష్ణ (67) అనే వృద్ధుడు విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. స్థానికులు, పోలీసుల వివరాల ప్రకారం.. కృష్ణ ఐదేళ్లుగా కాలనీలోని ఓ అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మన్‌గా పనిచేస్తున్నాడు. ఇదే అపార్ట్‌మెంట్‌లో 90వ వార్డు టీడీపీ కార్పొరేటర్ బొమ్మిడి రమణ నివాసం ఉంటున్నారు. సమీపంలోనే కార్పొరేటర్ కార్యాలయం ఉంది. శుక్రవారం ఉదయం కార్యాలయానికి వెళ్లిన కార్పొరేటర్ తాళాలు మర్చిపోవడంతో.. ఇంటికి ఫోన్ చేసి వాచ్‌మన్‌తో తాళాలు పంపించమన్నారు. తాళాలు తీసుకుని కార్యాలయానికి వెళ్లిన కృష్ణకు.. అక్కడ కిందపడి ఉన్న ఫ్లెక్సీని సరిచేసి పెట్టమని కార్పొరేటర్ చెప్పినట్లు ఒక కథనం ప్రచారంలో ఉంది. ఫ్లెక్సీని సరిచేస్తుండగా... అది సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి విద్యుత్ సరఫరా జరిగిందని, దీంతో కృష్ణ విద్యుదాఘాతానికి గురై అక్కడే పడిపోయాడని స్థానికులు తెలిపారు. వెంటనే అప్రమత్తమైన స్థానికులు కృష్ణను సమీపంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే అతను మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మరోవైపు మృతుడి కుమారుడు నాగరాజు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో మాత్రం భిన్నమైన వివరాలు పేర్కొన్నాడు. తన తండ్రి మందులు కొనుగోలు చేసేందుకు వెళ్తున్న సమయంలో.. రోడ్డుపై పడి ఉన్న ఫ్లెక్సీని తొలగించే ప్రయత్నంలో విద్యుత్ షాక్‌కు గురై మరణించాడని తెలిపాడు. ఘటనా స్థలానికి చేరుకున్న ఎయిర్‌పోర్టు పోలీసులు వివరాలు సేకరించారు. నాగరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. కార్పొరేటర్ ఆదేశాల మేరకు ఫ్లెక్సీని సరిచేశాడా.. లేక స్వచ్ఛందంగా తొలగించే ప్రయత్నంలో ప్రమాదం జరిగిందా అనేది పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది. కృష్ణకు భార్య గౌరమ్మ, కుమారుడు నాగరాజు ఉన్నారు.



ట్రాన్స్‌ఫార్మర్‌కు సమీపంలో కార్పొరేటర్ బొమ్మిడి రమణ ఫ్లెక్సీ



కృష్ణ(ఫైల్)

విద్యుత్ తీగకు కేబుల్ వైరు తగిలి సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని..



పద్మావతి(ఫైల్)

మర్రిపాలెం: విద్యుత్ షాక్‌కు గురై ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని దుర్మరణం పాలైంది. కంచరపాలెం పోలీస్ స్టేషన్ పరిధి మురళీనగర్‌లోని అయ్యప్పనగర్‌లో ఈ సంఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..

జి.వి.పద్మావతి (29) తన భర్త అజయ్‌తో కలిసి అయ్యప్పనగర్‌లో నివాసముంటున్నారు. ఆమె నగరంలోని ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో పనిచేస్తూ, ప్రస్తుతం వర్క్ ఫ్రం హోం చేస్తున్నారు. రెండవ అంతస్తులో నివాసం ఉంటున్న వీరు పాల ప్యాకెట్లను కింద సెల్లార్ నుంచి తెచ్చుకోవడానికి ప్లాస్టిక్ డబ్బాకు కేబుల్ వైరు కట్టి ఉపయోగిస్తున్నారు. శుక్రవారం ఉదయం 7 గంటల సమయంలో పద్మావతి ఎప్పటిలాగే రెండవ అంతస్తు నుంచి కేబుల్ వైర్ సహాయంతో సెల్లార్‌లోని పాల ప్యాకెట్లను తీసుకుంటున్నారు. అయితే గురువారం రాత్రి కురిసిన వర్షం కారణంగా కేబుల్ వైరు విద్యుత్ తీగలకు తగిలింది. ఇది గమనించని పద్మావతి విద్యుత్ షాక్‌కు గురైన అక్కడికక్కడే కుప్పకూలి మృతి చెందారు. భర్త అజయ్ వెంటనే కంచరపాలెం పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ షేక్ సమీర్ తమ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. స్థానికుల నుంచి వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. కూర్మన్నపాలేనికి చెందిన పద్మావతికి నాలుగేళ్ల కిందట అజయ్‌తో వివాహమైంది. వీరికి పిల్లలు లేరు. అజయ్ మిలటరీ ఇంజినీరింగ్ సర్వీస్ (ఎంఈసీ)లో కాంట్రాక్ట్ పనులు చేస్తున్నారు.

గ్రిల్స్ దాటే ప్రయత్నంలో..

పీఎంపాలెం: పీఎంపాలెం పోలీస్‌స్టేషన్ పరిధిలో విషాదకర సంఘటన చోటుచేసుకుంది. ఇంటికి మరో పది నిమిషాల్లో చేరుకోవాల్సి ఉండగా.. చిన్న పొరపాటు వల్ల ఓ పెయింటర్ విద్యుత్ షాక్‌కు గురై ప్రాణాలు కోల్పోయాడు. సీఐ బాలకృష్ణ తెలిపిన వివరాలివి.. దుద్దు కృష్ణ కుమార్(38) కొమ్మాది వైఎస్సార్ కాలనీలోని బ్లాక్ నంబరు 31 జీఎఫ్8లో తన భార్య సునీత, ఇద్దరు పిల్లలతో కలిసి నివసిస్తున్నాడు. పెయింటింగ్ పనులే అతని జీవనాధారం. గురువారం ఉదయం ఎప్పటిలాగే పనికి వెళ్లిన కృష్ణ కుమార్.. రాత్రి సుమారు 9.30 గంటల సమయంలో కొమ్మాది కూడలి వద్ద ఆటో దిగాడు. మరో పది నిమిషాల్లో ఇంటికి చేరుకుంటానని భార్యకు ఫోన్ చేసి చెప్పాడు. 9.45 గంటల సమయంలో టీఏఫ్‌సీ బేకరీకి ఎదురుగా జాతీయ రహదారి మధ్యలో ఉన్న గ్రిల్స్‌ను దాటే ప్రయత్నంలో.. అక్కడ సెంటర్ లైటింగ్ కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాన్ని పట్టుకున్నాడు. గ్రిల్స్ ఎక్కే క్రమంలో స్తంభానికి ఉన్న విద్యుత్ ప్రవహిస్తున్న వైర్లు తాకడంతో.. షాక్‌కు గురై కిందపడిపోయాడు. అపస్మారక స్థితిలో పడి ఉన్న కృష్ణ కుమార్‌ను గమనించిన స్థానికులు అతని భార్య సునీతకు సమాచారం అందించారు. వెంటనే ఆమె అక్కడికి చేరుకుని.. భర్తను చికిత్స నిమిత్తం గాయత్రీ ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. సమాచారం అందుకున్న పీఎం పాలెం పోలీసులు ఆసుపత్రికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. మృతుడి భార్య సునీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ బాలకృష్ణ తెలిపారు.



కృష్ణ కుమార్(ఫైల్)



కృష్ణకుమార్‌ను బతికించేందుకు యత్నిస్తున్న స్థానికులు

సరస్వతీ పుష్కరాలకు ఆర్టీసీ బస్సులు

గ్రూప్–1 పరీక్షలకు ప్రత్యేక సర్వీసులు

డాబాగార్డెన్స్: కాళేశ్వరంలో గోదావరి, ప్రాణహిత నదులు, భూగర్భ సరస్వతీ నదితో కలిసే పవిత్ర సంగమం వద్ద నిర్వహించే సరస్వతి పుష్కరాలకు వెళ్లే యాత్రికుల కోసం ఏపీఎస్ఆర్టీసీ విశాఖ నుంచి ప్రత్యేక సర్వీసులు నడుపుతుందని జిల్లా ప్రజా రవాణా అధికారి బి.అప్పలనాయుడు తెలిపారు. విశాఖ నుంచి కాళేశ్వరం వెళ్లి తిరిగి వచ్చేందుకు ఈ నెల 14, 16, 17 తేదీల్లో ద్వారకా బస్టేషన్ నుంచి ప్రత్యేక బస్సులు బయలుదేరుతాయన్నారు. టికెట్ ధర ఒకరికి సూపర్ లగ్జరీ బస్సు రూ.2,500, అల్ట్రా డీలక్స్ రూ.2,350, ఇంద్ర సర్వీస్‌కు రూ.3,000గా నిర్ణయించినట్లు చెప్పారు. టికెట్లు కావాల్సిన వారు ఆన్‌లైన్‌లో గానీ, ద్వారకా బస్టేషన్ రిజర్వేషన్ కౌంటర్‌లో గానీ బుక్ చేసుకోవచ్చని సూచించారు. అలాగే 34 మంది కలిసి ఒక బృందంగా వచ్చినట్లయితే వారికి అనుకూలమైన రోజున బస్సులు ఏర్పాటు చేస్తామన్నారు. మరిన్ని వివరాలకు 99592 25602, 99592 25594, 90522 27083, 91001 09731 నంబర్లను సంప్రదించవచ్చు. అలాగే గ్రూప్–1 పరీక్షలు రాసే అభ్యర్థుల సౌకర్యార్థం ఈ నెల 3 నుంచి 9 వరకు పెందుర్తి–ఆనందపురం మధ్య ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు అప్పలనాయుడు ఓ ప్రకటనలో వెల్లడించారు.

ఆరిలోవ ఏఎస్ఐ మృతి



రమణ(ఫైల్)

ఆరిలోవ: ఆరిలోవ పోలీస్ స్టేషన్ ఏఎస్ఐగా విధులు నిర్వర్తిస్తున్న రమణ మరణించారు. అప్పుఘర్‌లో నివాసం ఉంటున్న ఆయన గత నెల 30న జరిగిన చందనోత్సవంలో విధులు నిర్వర్తించారు. అనంతరం అస్వస్థతకు గురైన ఆయన సెలవు తీసుకున్నారు. శుక్రవారం ఇంటి వద్ద అతని బైక్ స్టాండ్ వేస్తుండగా అదుపు తప్పి కిందపడటంతో తలకు తీవ్ర గాయమైంది. వెంటనే కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించేసరికే ఆయన ప్రాణాలు కోల్పోయినట్లు ఆరిలోవ సీఐ హెచ్.మల్లేశ్వరరావు తెలిపారు. రమణ గుండె, ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడుతూ.. రెండేళ్లుగా చికిత్స పొందుతున్నట్లు ఆయన చెప్పారు. రమణకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆయన పీఎంపాలెం పోలీస్ స్టేషన్ ట్రాఫిక్‌లో పని చేసి నాలుగేళ్ల కిందట బదిలీపై ఆరిలోవ వచ్చారు. ఇక్కడ లా అండ్ ఆర్డర్ విభాగంలో విధులు నిర్వహిస్తున్నారు.

కాలువలో పడి వ్యక్తి మృతి



కాలువలో వెంకటరమణ మృతదేహం

అక్కిరెడ్డిపాలెం: గాజువాక మండలం చినగంట్యాడ గ్రామం అమరావతి పార్కు వద్ద గల కాలువలో ఓ వ్యక్తి ప్రమాదవశాత్తూ పడి శుక్రవారం మృతి చెందాడు. గాజువాక పోలీసులు తెలిపిన వివరాలివి.. గాజువాక మండలం, పాతకర్ణవానిపాలేనికి చెందిన పి.వెంకటరమణమూర్తి (60) ఆఫ్టింగ్ డ్రైవర్‌గా పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. నాలుగు నెలలుగా అతను డ్రైవింగ్‌కు వెళ్లడం లేదు. నాలుగేళ్ల కిందటఅతని భార్య చనిపోవడంతో మద్యానికి బానిసయ్యాడు. రోజూ మాదిరిగానే గురువారం ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. శుక్రవారం ఉదయం వరకూ ఇంటికి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు గాలించగా కాలువలో పడి మృతి చెందినట్టు గుర్తించారు. అతనికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. పెద్ద కుమారుడు హరికృష్ణ ఫిర్యాదు మేరకు గాజువాక సీఐ పార్థసారధి కేసు దర్యాప్తు చేస్తున్నారు.



వెంకటరమణ(ఫైల్)

స్నేహక్లబ్‌పై కేసు నమోదు

సీతమ్మధార: నగరంలో బోర్డు తిప్పేసిన ఫైనాన్స్ సంస్థ అధినేతపై ఎట్టకేలకు పోలీసులు కేసు నమోదు చేశారు. సీతంపేటలోని స్నేహక్లబ్ పేరిట అధిక వడ్డీ ఆశ చూపి, పెద్ద ఎత్తున డిపాజిట్లు సేకరించి శఠగోపం పెట్టిన సంగతి తెలిసిందే. దీంతో బాధితులు ఇటీవల సీతంపేట సమీపంలోని సంస్థ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. కాగా.. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ద్వారకా పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. నిందితుడు, మాజీ ఐఆర్ఎస్ అధికారి కటికల శివభాగ్యారావు 2001లో జీవీఎంసీ 25వ వార్డు రాజేంద్రనగర్‌లో స్నేహక్లబ్‌ను స్థాపించారు. సుమారు రూ.6.30 కోట్ల వరకు డిపాజిట్లు సేకరించారు. ప్రస్తుతం నిందితుడు హైదరాబాద్‌లో ఉన్నట్లు ద్వారకా స్టేషన్ సీఐ డి.వి. రమణ తెలిపారు. కేసు దర్యాప్తులో ఉందన్నారు.

అపోలోలో గుండె, పేస్‌మేకర్ పరీక్షలు ఉచితం

బీచ్‌రోడ్డు: నేటి జీవన పరిస్థితుల్లో ఆరోగ్యం పట్ల ప్రతి ఒక్కరూ శ్రద్ధ వహించి, ముందుగానే వైద్య పరీక్షలు నిర్వహించుకోవాలని అపోలో ఆసుపత్రి కార్డియాలజీ వైద్య నిపుణులు డాక్టర్ వినీషా సూచించారు. రామ్‌నగర్‌లోని అపోలో ఆసుపత్రిలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రతి ఒక్కరికి ఛాతీ నొప్పి వచ్చినప్పుడు అది గుండెకు సంబంధించిన సమస్యనా లేదా గ్యాస్ట్రిక్ సమస్యనా అనే ఆలోచన వస్తుందని, ఇకపై ఎలాంటి ఆలోచన లేకుండా నేరుగా అపోలో ఆసుపత్రికి వస్తే ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఈసీజీ, కొలెస్ట్రాల్, రక్త పరీక్షలు నిర్వహించి సమస్యను నిర్ధారిస్తామని, ఒకవేళ గుండెకు సంబంధించిన సమస్య అయితే ఉచితంగా కార్డియాలజీ నిపుణులతో వైద్య సలహాలు అందిస్తామని వివరించారు. ఇప్పటి వరకు 800 మందికిపైగా ఈ పరీక్షలను ఉచితంగా నిర్వహించినట్లు ఆమె పేర్కొన్నారు. అలాగే డివైస్ క్లినిక్ ఏర్పాటు చేశామని, ఈ క్లినిక్‌లో పేస్‌మేకర్ పరీక్షలను ఉచితంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అంతేకాకుండా కేవలం రూ.999లకే జనరల్ హెల్త్ చెకప్ ప్యాకేజీని అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. ఈ అవకాశం ఈ నెల 15వ తేదీ వరకు మాత్రమే అందుబాటులో ఉంటుందని, నగరవాసులు వినియోగించుకోవాలని కోరారు. డాక్టర్ లక్ష్మీనారాయణ, డాక్టర్ టి.రవికాంత్, అడ్మినిస్ట్రేటర్ సందీప్ తదితరులు పాల్గొన్నారు.



బ్రోచర్‌ను విడుదల చేస్తున్న వైద్యులు

బాబూ.. 'గ్యాస్' డబ్బులేవీ?

- కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించిన మహిళలు
- జీవీఎంసీ 31వ వార్డులో నిరసన



కృష్ణాగార్డెన్స్ రామాలయం వద్ద నిరసన తెలుపుతున్న మహిళలు

డాబాగార్డెన్స్: ఉచిత గ్యాస్ సిలిండర్లు, నెలకు రూ.1500 నగదు బదిలీ, తల్లికి వందనం తదితర సూపర్ సిక్స్ హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ఆరోపిస్తూ మహిళలు శుక్రవారం నిరసనకు దిగారు. 'బాబు గారూ.. గ్యాస్ సిలిండర్ డబ్బులు ఎప్పుడు చెల్లిస్తారు?' అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. జీవీఎంసీ 31వ వార్డు కృష్ణాగార్డెన్స్ రామాలయం వద్ద ఐద్వా, సిటు సంయుక్త ఆధ్వర్యంలో ఈ నిరసన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్‌లో ఒక్కటి కూడా అమలు కాలేదని మండిపడ్డారు. గ్యాస్ సిలిండర్‌కు సంబంధించి వంద మందిలో కేవలం 30 మందికి మాత్రమే నగదు అందిందని.. మిగిలిన వారికి ఇవ్వడం లేదని ఆరోపించారు. తాము సిలిండర్‌కు చెల్లించిన పూర్తి మొత్తాన్ని తిరిగి తమ బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే నెలకు రూ.1500 చొప్పున ప్రతి మహిళా ఖాతాలో జమ చేస్తామని చెప్పిన హామీ కేవలం నీటి మూటగానే మిగిలిపోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. తల్లికి వందనం పథకం ఊసే లేదని, ఉచిత బస్సు సౌకర్యం కూడా అమలు కావడం లేదని విమర్శించారు. నిత్యావసర వస్తువుల ధరలను ప్రభుత్వం పెంచుతోందని, తాజాగా డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్ ధరను రూ.811 నుంచి రూ.861కి పెంచడం ద్వారా పేద, మధ్యతరగతి ప్రజలపై తీవ్ర భారం మోపిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పెరుగుతున్న ధరలపై ఎందుకు నోరు మెదపడం లేదని రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. తెలుగుదేశం, జనసేన, బీజేపీ కార్యకర్తలు కూడా ప్రభుత్వ తీరుతో బయటకు కక్కలేక.. లోలోన మదన పడతున్నారన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఇది ఎలా మంచి ప్రభుత్వం అని ప్రశ్నించారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, పెరిగిన ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. నిరసనలో సిటు నాయకులు కర్రి గణేష్, ఎం.సుబ్బారావు, లెనిన్, అమ్మాజీ, అరుణ, లక్ష్మి, సరోజిని, వెంకటలక్ష్మి, పార్వతి, కాంతం, రామయ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

ధరల భారంతో బతుకు అస్తవ్యస్తం



ఉచిత గ్యాస్ మాట దేవుడెరుగు. కనీసం ఉన్న గ్యాస్ ధరనైనా తగ్గించలేదు, పైగా పెంచేశారు. దీంతో పేద, మధ్య తరగతి బతుకులు మరింత భారంగా మారాయి. ఇంతవరకు గ్యాస్ డబ్బులు కూడా ఖాతాల్లో పడలేదు. కూటమి ప్రభుత్వం పేదల గోడు పట్టించుకోవాలి.

–ఎస్.అమ్మాజీ, స్థానికురాలు

ప్రశ్నించాల్సిన సమయం ఆసన్నమైంది



ప్రభుత్వంపై మహిళలు తిరగబడే రోజులు ఎంతో దూరంలో లేవు. ఎన్నికల ముందు ఊకదంపుడు ఉపన్యాసాలిచ్చి.. ఇప్పుడు కనిపించకుండా పోయిన నాయకులను ప్రశ్నించాల్సిన సమయం ఆసన్నమైంది. నిత్యావసరాలతో పాటు గ్యాస్ ధరలు పెరుగుతుంటే అడిగే దిక్కు కరువైంది. గ్యాస్ సిలిండర్ డబ్బుల కోసం కంపెనీ కార్యాలయాల్లో అడిగితే.. ప్రభుత్వ నుంచి చెల్లింపులు అందలేదని, తామేం చేయలేమని నిర్లక్ష్యంగా సమాధానమిస్తున్నారు.

– బొట్టా సరోజిని, స్థానికురాలు

దివ్యాంగ ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

మధురవాడ: దివ్యాంగులకు ఉచిత వసతి, విద్యను అందించి, వారిని ప్రయోజకులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో బక్కన్నపాలెంలోని ఆంధ్రప్రదేశ్ విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సహాయ సంస్థ, శిక్షణ, ఉత్పత్తి కేంద్రం పనిచేస్తోంది. 2025–26 విద్యా సంవత్సరానికి ఇక్కడ ఐటీఐ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతున్నట్లు ప్రాజెక్ట్ అధికారి జె.మాధవి తెలిపారు. రాష్ట్రంలోని 26 జిల్లాలకు చెందిన అర్హులైన, ఆసక్తి గల దివ్యాంగ అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.

అందుబాటులో ఉన్న ట్రేడ్‌ల వివరాలివి..

కార్పెంటర్ కోర్సులో 24 సీట్లు ఉండగా 10వ తరగతి పాస్/ఫెయిల్ అయిన వారు అర్హులు. శిక్షణ కాలం ఒక సంవత్సరం. షీట్ మెటల్ వర్క్ కోర్సులో 20 సీట్లు ఉండగా, 10వ తరగతి ఉత్తీర్ణులైన వారు అర్హులు. శిక్షణ కాలం ఒక సంవత్సరం. వెల్డర్ కోర్సులో 20 సీట్లు ఉండగా, 10వ తరగతి పాస్/ఫెయిల్ అయిన వారు. శిక్షణ కాలం ఒక సంవత్సరం. ఆసక్తి గల విద్యార్థులు https://iti. ap.gov.in ద్వారా మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తుతో పాటు విద్యార్హత సర్టిఫికెట్లు, నివాస ధ్రువీకరణ పత్రం, కుల ధ్రువీకరణ పత్రం, ఆదాయ ధ్రువీకరణ పత్రం, సదరం మెడికల్ సర్టిఫికెట్, ఆధార్ కార్డు, రేషన్ కార్డు, పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు వంటి వివరాలు సమర్పించాల్సి ఉంటుంది. ఈ నెల 24 రిజిస్ట్రేషన్‌కు ఆఖరు తేదీ అని ప్రాజెక్ట్ అధికారి తెలిపారు. ఈ నెల 24 నుంచి 26 వరకు దరఖాస్తుల పరిశీలన, జూన్ 2 నుంచి జూన్ 10వ తేదీ వరకు కౌన్సెలింగ్ ఉంటుందన్నారు. మరిన్ని వివరాల కోసం ప్రాజెక్ట్ ఆఫీసర్‌ను 90000 13610లో, ప్రిన్సిపాల్ సిహెచ్ భాస్కరరావును 73964 24319 లేదా 95021 23060 నంబర్లలో సంప్రదించవచ్చు.